క్లుప్తంగా

పొంచి ఉన్న ప్రమాదం



కె.మార్కాపురం ప్రధాన రోడ్డుపై గుంత

కల్లూరు: మండల పరిధిలోని కె.మార్కాపురం గ్రామంలో ప్రధాన రహదారిలో ఉన్న కాజ్‌వేపై గుంత (రంధ్రం) పడింది. ఈ రోడ్డుపై గ్రామానికి చెందిన రైతులు పొలాలకు, పెద్దకొట్టాలకు ప్రయాణికులు వెళ్తుంటారు. వేసవి సెలవులు ఉండటంతో ఉదయం, సాయంత్రం చిన్న పిల్లలు ఈ మార్గంలో ఆడుకుంటుంటారు. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి గుంత పూడ్చివేత పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారి మారినా పేరు మారలేదు



సచివాలయంలోని సమాచార బోర్డుపై పాత అధికారి పేరు దర్శనమిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండల దిన్నె దేవరపాడు గ్రామ సచివాలయంలోని సమాచార హక్కు చట్టం 2005 బోర్డుకు గతంలో పని చేసిన అధికారి పేరే నేటికీ దర్శనమిస్తోంది. కార్యాలయ భవనం గోడపై సమాచార హక్కు చట్టం బోర్డుకు సంబంధించి ప్రస్తుతం అప్పిలేట్ అధికారిగా గతంలో విధులు నిర్వర్తించిన ఎస్‌వీ భాస్కర్ నాయుడు పేరే ఉంది. కర్నూలు ఎంపీడీఓగా అజాంఖాన్ బాధ్యతలు స్వీకరించారు. అప్పిలేట్ అధికారి పేరు బోర్డుపై రాయాల్సి ఉంది. అయితే, గ్రామ స్థాయి అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో పాతపేరే నేటికీ ఉంది. ఉన్నతాధికారులు స్పందించి సమాచార హక్కు చట్టం బోర్డులో ప్రస్తుతం అప్పిలేట్ అధికారి పేరు రాయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విస్తారంగా పత్తి సాగు



బూజునూరు వద్ద పత్తి పైరులో సేద్యం చేస్తున్న రైతు

గడివేముల: ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పత్తి పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. ముఖ్యంగా మండల పరిధిలోని బూజునూరు, గడివేముల, బిలకల గూడూరు, గని, కొర్రపోలూరు, మంచాలకట్ట గ్రామాల్లో బోర్ల కింద పత్తి వేశారు. మండలంలో దాదాపు 26 వేల ఎకరాల పొలం ఉంది. ఇందులో 4వేల ఎకరాల వరకు ఇప్పటికే పత్తి పంట వేశారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో పంటలు కళకళలాడుతున్నాయి.

రైతులను దగా చేసిన కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు (రూరల్) : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన మద్దతు ధర విషయంలో రైతులను దగా చేసిందని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర రెడ్డి ఆరోపించారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, 7న ప్రకటించిన మద్దతు ధర కంటి తుడుపు చర్యగా ఉందని దుయ్యబట్టారు. వ్యవసాయ ఖర్చులు, ఎరువులు, విత్తనాల ధరలు పెరిగి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వర్షాలు రాక కనీసం పండించిన పంటను అమ్ముకునే సదుపాయం, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి హనుమంతు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు వనజ, వెంకటేశ్వర్లు, మధు, సిద్దయ్య గౌడ్, లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీకి నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు శనివారం 104 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాల కోసం ఈ నీటిని విడుదల చేశారు. డ్యాంలో ప్రస్తుతం1.110 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం అధికారులు తెలిపారు.

విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

కర్నూలు (రూరల్) : సర్దుబాటు పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని పాతబస్తీ పూలబజార్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో పాటు విద్యుత్ చార్జీలు పెంచడం ద్వారా పేదలపై భారం పడుతుందన్నారు.

జగనన్నది జన రంజక పాలన

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- ఓర్వకల్లులో ముగిసిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం



సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జనరంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ఓర్వకల్లులో గత ఐదురోజుల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజు శనివారం ఉదయం స్థానిక ఆంజనేయస్వామి వీధి, భైరెడ్డి బిల్డింగ్‌లు, సాయంత్రం కొండపేట, మంగళి వీధి కాలనీల్లో మండల స్థాయి అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఆఖరి రోజున సర్పంచు తోట అనూష స్వగృహం వద్ద స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి కుటుంబం ఏదో ఒక రూపంలో లబ్ధిపొందినట్లు తెలిపారు. అవినీతికి ఆస్కారం లేకుండా కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. వలంటీర్లను నియమించి దేశంలో ఎక్కడాలేని విధంగా సుపరిపాలన అందజేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అర్హులై ఇళ్ల పట్టాలు రానివారందరికీ త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. ప్రతి కాలనీలో తాగునీరు, మురుగు కాల్వలు, సీసీ రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, ఎంపీటీసీ సభ్యురాలు షాకీరున్నిషా, సింగిల్ విండో చైర్మన్లు చంద్రశేఖర్‌రెడ్డి, నాగతి రుపాలు, సచివాలయ మండల కన్వీనర్ లోటర్ బాషా, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ వాసుదేవరెడ్డి, స్థానిక నాయకులు శంకర్‌రెడ్డి, మీనిగ చంద్రశేఖర్ రెడ్డి, నాగలింగేశ్వరరెడ్డి, రాజమోహన్‌రెడ్డి, మద్దిలేటి, మాజీ సర్పంచు పెద్దయ్య, మైనార్టీ నాయకులు బషీర్‌మియా, చాంద్‌బాషా, చేట్ల ఏసేపు, జె.కృష్ణ, సతీష్, క్రిష్టపార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- చంద్రబాబువి ఊసరవెల్లి రాజకీయాలు...
- ప్యాలకుర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధాకర్

కోడుమూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా ప్రతి ఇంటికి అందుతున్నాయని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. శనివారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, దిశ కమిటీ సభ్యులు రమేష్‌తో కలిసి ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటిఇంటికి వెళ్లి నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించి అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మట్టి మిద్దెలు, పూరి గుడిసెల్లో నివసిస్తున్న తమకు ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని ఎస్సీ కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. అలాగే తమ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. ఆయా వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శేష ఫణి, ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు ఎమ్మెల్యే ఆదేశించారు.

చంద్రబాబు ఊసరవెల్లి

సీఎంగా 14ఏళ్ల పాలనలో చంద్రబాబు ప్రజలకేమీ చేయలేదని, ఆయన ఊసరవెల్లిలాగా రాజకీయాలు చేస్తుంటారని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ విమర్శించారు. తమ ప్రభుత్వం పేదల కోసం సంక్షేమ పథకాలను అమలుచేస్తే ప్రజలను సోమరిపోతులను చేస్తున్నారని చెప్పిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. ఎన్నికల దగ్గర పడటంతో ఇప్పుడు వైఎస్సార్‌సీపీ కంటే అధికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తానని మాయ మాటలు చెబుతున్నారన్నారు. అధికారం కోసం ఆయన ఎంతకైనా దిగజారుతారని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ప్రజా సంక్షేమం కోసం రూ.10వేల కోట్లకు పైగా నిధులను రాష్ట్రానికి తెస్తే ఓర్వలేని చంద్రబాబు లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో జగనన్నపై ఒంటరిగా పోటీ చేయలేక చంద్రబాబు బీజేపీతో పొత్తుకై బీజేపీ నాయకుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారన్నారు. కొన్ని పత్రికలు తనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ కథనాలు ప్రచురిస్తున్నాయని, దీనిపై త్వరలో పరువునష్టం దావా వేస్తున్నట్లు సుధాకర్ చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు, ఏఈలు గంగరాజు, ఇస్మాయిల్, ఈఓఆర్డీ మంజుల, ఏపీఓ రమాదేవి, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు శ్రీనివాసులు, మాధులు, మిన్నెల్ల, సులేమాన్, రవి, మదన్, సచివాలయ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బీడీ బంకులో చోరీ

కర్నూలు: స్థానిక రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రకాష్ నగర్ ఆర్చి వద్ద ఉన్న బీడీ బంకులో దొంగలు పడి అందినకాడికి మూటగట్టుకుని ఉడాయించారు. బంకు నిర్వాహకుడు వెంకటేష్ శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో వ్యాపారం ముగించుకుని బంకుకు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళాలు పగులగొట్టి అందులో ఉన్న రూ.2 వేల నగదు, రూ.2 వేలు విలువ చేసే సరుకులు మూటగట్టుకుని వెళ్లారు. శనివారం ఉదయం వెంకటేష్ వచ్చి చూసేసరికి తాళాలు తెరిచి ఉన్నాయి. బంకులో ఉన్న సరుకులన్నీ చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గత రెండు రోజులుగా బీడీ బంకులే లక్ష్యంగా చోరీలు చోటు చేసుకుంటున్నాయి. పాత సిరి నోబుల్ ఆసుపత్రి పక్కన ఉన్న బీడీ బంకు, మారెమ్మ దేవాలయం పక్కనున్న టీ హోటల్‌లో గ్యాస్ సిలిండర్, అశోక్ నగర్‌లోని మరో బీడీ బంకులో దొంగలు చోరీకి పాల్పడ్డారు. వరుస చోరీలతో చిరు వ్యాపారులు హడలెత్తిపోతున్నారు. వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు ముక్తార్, శేషన్న తదితరులు నేరస్థలాన్ని పరిశీలించి బంకు నిర్వాహకుడు వెంకటేష్‌ను విచారించారు.

పోలీసుల అదుపులో మహిళా దొంగలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులు, వారి సహాయకుల నుంచి డబ్బు, సెల్‌ఫోన్లు తస్కరిస్తున్న ఇద్దరు మహిళా దొంగలను శనివారం ఆసుపత్రి సెక్యూరిటీసిబ్బంది పట్టుకున్నారు. వారిని ఆసుపత్రిలోని అవుట్‌పోస్టు పోలీసులకు అప్పగించడంతో అనంతరం వారిని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాధాకృష్ణ టాకీస్ వీధికి చెందినట్లుగా చెబుతున్న రజియాతో పాటు ఆమె సోదరి ఇద్దరూ కలిసి ఆసుపత్రిలో ఉదయం నుంచి కలియదిరుగుతూ రోగులు, వారి సహాయకుల నుంచి సెల్‌ఫోన్లు, పర్సులు దొంగిలిస్తున్నారు. క్యాజువాలిటీ వద్ద ఓ మహిళ వద్ద పర్సును దొంగలిస్తుండగా అనుమానంతో ఆమె పట్టుకుని సెక్యూరిటీ సిబ్బందికి అప్పగించారు. ఆమె బ్యాగ్‌లో రెండు బ్లేడ్లు, కొద్దిగా డబ్బు, మూడు సెల్‌ఫోన్లు లభించాయి.

తల్లితో గొడవ పడి కుమారుడు అదృశ్యం

కర్నూలు : మండల పరిధిలోని ఇ.తాండ్రపాడు గ్రామానికి చెందిన మహేష్ బాబు (18) తల్లి లక్ష్మీదేవితో గొడవ పడి ఇంట్లో నుంచి అదృశ్యమయ్యాడు. ఆంజనేయులు, లక్ష్మీదేవి దంపతులకు ఒక కూతురు, కొడుకు సంతానం. కుమారుడు మహేష్ బాబు భాగ్యనగర్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. తండ్రి ఆంజనేయులు కొన్నేళ్ల క్రితం చనిపోవడంతో మహేష్ బాబు, చెల్లెలు కలసి తల్లి దగ్గరే ఉంటున్నారు. మే 17వ తేదీన ఇంట్లో తల్లితో గొడవ పడి వెళ్లిపోయాడు. అతడి కోసం బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా కనిపించకపోవడంతో తల్లి కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

25 వాహనాలు సీజ్



పట్టుబడిన మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ

కర్నూలు : నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ పోలీసులు మైనర్ డ్రైవింగ్‌పై శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో నగరంలోని రాజ్‌విహార్, సి.క్యాంప్ సెంటర్, ఓల్డ్ ఈద్గా, చెన్నమ్మ సర్కిల్ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో 25 మంది మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వాహనాలను సీజ్ చేసి కొత్తపేట దగ్గరున్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మైనర్ల తల్లిదండ్రులను సాయంత్రం స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ రాంగ్‌రూట్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వాహనం నడపటం ప్రమాదకరమని డీఎస్పీ నాగభూషణం హెచ్చరించారు. 25 మంది మైనర్లపై ట్రాఫిక్ నిబంధన ఉల్లంఘన కేసులు నమోదు చేసి రూ.50,875 జరిమానా విధించారు. భవిష్యత్తులో మైనర్లకు వాహనాలు అప్పగించమని వారి తల్లిదండ్రుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

స్పోర్ట్స్

విజేత జట్లకు బహుమతుల ప్రదానం



విజేత జట్ల క్రీడాకారులతో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని శివనరసింహారెడ్డి

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లులో నిర్వహించిన కేఎస్ఎన్ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. మొత్తం 45 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో రెండోస్థానంలో లక్ష్మీపురం, మూడోస్థానంలో ఓర్వకల్లు జట్టు నిలిచింది. ఈ జట్లకు శనివారం ఎమ్మెల్యే కాటసాని స్వగృహం వద్ద బహుమతులు ప్రదానం చేశారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన తనయుడు, వైఎస్సార్‌సీపీ యువనేత కాటసాని శివనరసింహారెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ రాజేష్, చేట్ల ఏసేపు, కన్నమడకల రమేష్, సతీష్, బోయ రమేష్, సంజన్న, కుమార్, రెడ్డిపోగు బుజ్జి, శాంతకుమార్, నవీన్, అమృతరాజు, సంపత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రగ్బీ పోటీల్లో సత్తాచాటాలి

కర్నూలు(రూరల్): ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఈనెల 11, 12 తేదీల్లో జరిగే జాతీయస్థాయి ట్రైబల్ రగ్బీ పోటీల్లో సత్తాచాటాలని ఏపీ రగ్బీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం బి.క్యాంప్ క్రీడా మైదానంలో ఆయన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే పురుషులు, మహిళల జట్టును ప్రకటించారు.

పురుషుల జట్టు...

చంద్రశేఖర్, సురేష్ నాయక్, బోగి నాయక్, నవీన్, బ్రహ్మయ్య, అప్పలరాజు, సోమేశ్వర్, రవిబాబు, ఉదయ్‌కిరణ్, వెంకటేష్, మల్లేష్

మహిళా జట్టు

రాజ్యలక్ష్మి, స్వామిని, జానకి, సత్య కళ్యాణి, మానస, నందిని. ఈ పోటీలకు కోచ్‌గా సుమంత్, మేనేజర్‌గా వెన్నెల వ్యవహరిస్తున్నారు.

రక్షణ గోడ నిర్మించండి

కల్లూరు: మండల పరిధిలోని పెద్దపాడు సమీపంలో వక్కెర వాగు బ్రిడ్జికి రక్షణ గోడ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం బస్సులు, కార్లు, బైక్‌లు తిరుగుతుంటాయి. వాహనదారులు పొరపాటున అదుపు తప్పితే వాగులో పడిపోవలసి వస్తుంది. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి రక్షణ గోడ ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. కోడుమూరు నుంచి కర్నూలు వైపు పెద్దపాడు సమీపంలోని వక్కెర వాగుకు ముందుగా రోడ్డు మలుపును చూపించే సూచిక బోర్డు కింద పడింది. అలాగే సూచిక బోర్డును కూడా సరిచేయాలని వాహనదారులు కోరుతున్నారు.



వక్కెర వాగు బ్రిడ్జి దగ్గర రక్షణ గోడలేని దృశ్యం

నేలకొరిగిన పురాతన చెట్టు



కూకటి వేళ్లతో నేల కొరిగిన మర్రివృక్షం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం ఊరుమందరి చెరువు కట్టపై ఉన్న భారీ మర్రి చెట్టు నేలకొరిగింది. శుక్రవారం అర్ధరాత్రి వీచిన బలమైన గాలుల ధాటికి చెట్టు రెండుగా చీలి ప్రధాన రోడ్డులోని విద్యుత్ వైర్లపై పడింది. వెంటనే అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి చెట్టుకొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. గాలులకు కూలిపోయిన ఈ చెట్టు దాదాపు 4వందల ఏళ్ల నాటిదని గ్రామస్తులు తెలిపారు.

కొలత తప్పుతోంది!

- మోసాలకు పాల్పడుతున్న వ్యాపారులు
- వస్తువుల క్రయ, విక్రయల్లో కిలోకు 100 నుంచి 150 గ్రాముల వరకు తరుగు
- పెట్రోల్, డీజిల్ అమ్మకాల్లోనూ అదే తీరు
- నష్టపోతున్న వినియోగదారులు
- చోద్యం చూస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

వ్యాపారుల లాభాపేక్షతో ఎక్కడ చూసినా తూనికలు... కొలతల్లో మోసం కనిపిస్తూనే ఉంది. చిన్న కిరాణం కొట్టు మొదలు...బంగారు దుకాణాల వరకు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నాయి. పాలనుంచి పెట్రోల్ వరకూ కొలతల్లో దగా చేస్తున్నారు. దీంతో వినియోగదారుడు నిత్యం నష్టపోతున్నా తూనికల కొలతల శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.



బండిపై నల్ల నేరేడు పండ్లను రాయితో తూకం వేస్తున్న దృశ్యం



ఎలక్ట్రానిక్ కాటాలో అవే నేరేడు పండ్లను తూకం వేయగా 250 గ్రాములకు గాను 210 గ్రాములు చూపిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూసిటీ): నిత్యావసరాలైన కూరగాయలు, పండ్లు, గృహ నిర్మాణ సామగ్రి, పెట్రోల్, డీజిల్ తదితర అన్ని వస్తువుల విక్రయాల్లో భారీగా మోసాలు జరుగుతున్నాయి. ఒక వైపు కల్తీ.. మరో వైపు తుకాల్లో మోసాలతో వినియోగదారులు నష్టపోతున్నారు. కొందరు వ్యాపారులు కనీస ప్రమాణాలు పాటించడం లేదు. నగరంలో ఈపరిస్థితి ఎక్కువగా ఉంది. ఇక పెట్రోల్, డీజిల్ అమ్మకాల్లో మరింత అధికంగా మోసాలు జరుగుతున్నాయి. కొన్ని పెట్రోల్ బంకుల యజమాన్యాలు ఎలక్ట్రికల్ వేయింగ్ మిషన్లతో ట్యాంపరింగ్ చేస్తున్నాయి. లీటరు పెట్రోల్ 100 నుంచి 200 మిల్లీ మీటరుల వరకూ పక్కదారి పట్టిస్తున్నారు. ఏ రోజుకారోజూ పెట్రోల్, డీజిల్ ధరలను ప్రదర్శించాల్సి ఉన్నా, ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. ఫిర్యాదు రావడమో, గొడవ పడడమో జరిగితే తప్ప అధికారులు స్పందించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఫిల్టర్ పేపర్ ఏదీ?

నగరంలో పదుల సంఖ్యలో పెట్రోలో బంకులు ఉన్నాయి. వాటి వద్ద పెట్రోల్ నాణ్యతను తెలుసుకునేందుకు ఫిల్టర్ పేపర్ టెస్ట్ అందుబాటులో ఉంచాలి. ఆ పేపర్‌పై రెండు మూడు చుక్కలు పెట్రోల్ వేస్తే అది ఆవిరైపోతే నాణ్యత కలిగినది. అదే మరకలుగా మిగిలిపోతే కల్తీ జరిగినట్లు నిర్ధారిస్తారు. ఈ విషయం చాలామంది వినియోగదారులకు తెలియదు. ఎక్కడ తమ మోసం బయటపడుతుందోనని చాలా మంది పెట్రోల్ బంకుల యజమానులు ఫిల్టర్ పేపర్ టెస్ట్ చేయడం లేదు.



పెట్రోల్ బంకు వద్ద ఫిల్టర్ పేపర్ పరీక్ష చేయకుండా వాహనాలకు పెట్రోల్ పోస్తున్న దృశ్యం

ప్రామాణిక ముద్ర ఏదీ?

నిత్యావసరాలు ఇతర ఆహార పదార్థాలు, పండ్ల తుకాల్లో మోసాల సంగతి చెప్పనక్కర్లేదు. కిలో దగ్గర 150 గ్రాముల వరకూ తగ్గించి అమ్ముతున్నారు. కొన్ని వస్తువులను ప్రామాణిక ముద్రతో విక్రయించాల్సి ఉన్నా ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నారు. వారపు సంతలు, మార్కెట్లు, రైతు బజారులో సైతం రాళ్లనే కొలతలుగా వినియోగిస్తున్నారు. స్వీట్ల దుకాణాల్లో వాటిపై తయారీ తేదీ ఉండాలనే నిబంధన ఉన్నా, ఎక్కడా ముద్రిస్తున్న దాఖలాలు లేవు.

గృహ నిర్మాణ సామగ్రిలో మోసాలు

గృహ నిర్మాణ సామాగ్రి అమ్మకాల్లో కూడా మోసాలు జరుగుతున్నాయి. ఒక్కో సిమెంట్ బస్తాపై కనీసం కేజీన్నర తరుగు వస్తోంది. కంపెనీ నిబంధనల సంగతి పక్కన పెడితే.. కొంతమంది దళారులు బస్తాలోని సిమెంట్ తీసి రీ ప్యాకింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తూకం తక్కువ వచ్చింది



కర్నూలులోని సీ క్యాంప్ వద్ద బండిపై 250 గ్రాముల నేరేడు పండ్లు తీసుకున్నాను. తూకంపై అనుమానం వచ్చి వేరే షాపులో కొలత వేయగా 40 గ్రాములు తక్కువ వచ్చింది. ముద్రించిన ఇనుప రాళ్లను కాకుండా మామూలు రాయితో తూకం వేస్తున్నారు. ఈ లెక్కనా చూసుకుంటే కేజీ పండ్లు తీసుకుంటే దాదాపు 160 గ్రాముల పండ్లు తక్కువగా వస్తాయి.

– రమేష్, కల్లూరు

వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారు



రెండు రోజుల క్రితం కృష్ణానగర్ ఐటీసీ వద్ద 5 కిలోల మామిడి పండ్లను తీసుకున్నాను. వేరే చోట తూకం వేయిస్తే మొత్తం మీద అరకిలో తక్కువ వచ్చింది. ఇలా ప్రతి వస్తువు తూకంలో మోసమే జరుగుతుంది. అడిగితే కరెక్టే ఉందని వ్యాపారులు చెబుతారు. తూనికల కొలతల శాఖ అధికారులు స్పందించి దుకాణాలపై తనిఖీలు ముమ్మరం చేయాలి.

– శివ, కృష్ణానగర్

ఫిర్యాదు చేస్తే చర్యలు



జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నాం. వ్యాపార సంస్థలు తప్పనిసరిగా ప్రమాణాలు పాటించాలి. లేకుండా చర్యలు తప్పవు. సిబ్బంది కొరత ఉన్నా ఉన్నంతలో మేము తనిఖీలు చేపడుతున్నాం. ఎక్కడైనా మోసాలు జరిగితే వెంటనే మాకు ఫిర్యాదు చేయాలి. దాడులు చేసి దుకాణాదారులపై చర్యలు తీసుకుంటాం.

– శ్రీరాములు, అసిస్టెంట్ కంట్రోలర్, తూనికలు, కొలతల శాఖ

ఈరోజు

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కోడుమూరు రూరల్: కోడుమూరు మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 11వతేదీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి శనివారం తెలిపారు. ప్రవేశ పరీక్ష కోసం 148మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, పరీక్ష రాసేందుకు విద్యార్థులకు సమయం ఉదయం 10 నుంచి 12గంటల వరకు ఉంటుందని, విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రం చేరుకోవాలన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు వెంట హాల్ టికెట్, బ్లూ పెన్ను తెచ్చుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

గడివేముల: మండల కేంద్రమైన గడివేముల మోడల్‌స్కూల్‌లో ఆరోతరగతిలో చేరేందుకు ఆదివారం ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శైలజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్షఉంటుందన్నారు. పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే విద్యార్థులు రావాలన్నారు.

కోడుమూరులో వర్షం

కోడుమూరు రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న వేళ శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెలవారుజామున వరకు కోడుమూరు మండలంలో వర్షం కురిసింది. 40.2 మి.మీ వర్షపాతం నమోదైంది. సీజన్ ప్రారంభంలోనే మంచి వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో వర్షం పడితే ఖరీఫ్ కింద పత్తి, కొర్ర, కంది, వేరుశనగ వంటి పంటలను సాగు చేసుకునేందుకు మండల రైతులు సిద్ధమవుతున్నారు.

19.2 ఎంఎం వర్షపాతం నమోదు

సి.బెళగల్: మండలంలో గతరాత్రి మోస్తరు వర్షం కురిసినట్లు మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో మండల వ్యాప్తంగా శనివారం 19.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని ఆయన అన్నారు.

గూడూరు: మండలంలో శనివారం 24.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. వరుసగా వర్షాలు పడుతుండడంతో రైతులు ఖరీఫ్ సాగు పనులు ముమ్మరం చేశారు.